## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షునిగా శిష్టు గోపి

– అభినందించిన మాజీ మంత్రి అప్పలరాజు




శిష్టు గోపికి స్వీట్ తినిపిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా సీనియర్ నాయకులు శిష్టు గోపి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం పలాస వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తలు, నాయకుల ప్రత్యేక సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ ప్రకటన చేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని శిష్టు గోపి అన్నారు. పట్టణ మాజీ అధ్యక్షులు సనపల సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, జిల్లా సెక్రటరీ, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, జిల్లా సెక్రటరీ బత్తిన హేమేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పీవీ సతీష్, బడగల బల్లయ్యానాయుడు, మహిళ ప్రతినిధి సుజాత పండా, కౌన్సిలర్ దున్న సత్యం, బెల్లాల శ్రీనివాస్, గుజ్జు జోగరావు, కర్రీ మాధవరావు, సవర సోమేశ్వరరావు, పప్పాల ప్రసాద్, పిచ్చుక అజయ్, జోగి సతీష్, బోనెల రాము, కో–ఆప్షన్ సభ్యులు గౌరీ త్యాడీ, బమ్మిడి సంతోష్ పాల్గొన్నారు.

### పాఠశాల పనితీరుపై సామాజిక తనిఖీ

కంచిలి: మఠంసరియాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పనితీరుపై సమగ్రశిక్షా, పీఎం పోషణ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం తదితర అంశాల మీద సామాజిక తనిఖీ గ్రామసభను శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఆర్పీలు కె.రామక్రిష్ణ, ఎస్.చంద్రరావుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థుల చదువు, ఆరోగ్యం, విద్యార్థులకు అందజేస్తున్న మెనూ, రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావు రౌళో, ఎస్ఎంసీ చైర్మన్ పి.శ్యామల పాల్గొన్నారు.

### ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ



జాడుపూడిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కంచిలి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం సోంపేట ఖండ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా రిటైర్డ్ ఆర్మీ, బీఎస్ఎఫ్, సైనికులు, స్వయం సేవకులు జాతీయ జెండాలు పట్టుకొని ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బసవపుట్టుగ, బసవకొత్తూరు, ఆర్.బెలగాం, జి.బెలగాం, జాడుపూడి గ్రామాల్లో జాతీయ జెండాలు చేత పట్టుకొని భరత్‌మాతాకి జై, అంబేడ్కర్‌కి జై, భారత రాజ్యాంగానికి జై అంటూ నినాదాలు చేస్తూ ఐదు కిలోమీటర్లు ర్యాలీ చేపట్టారు. అనంతరం జాడుపూడి శివాలయం ఆవరణలో సమావేశమయ్యారు. శ్రీకాకుళం సంఘచాలక్ పి.వి.రమణమూర్తి ముఖ్యవక్తగా వ్యవహరించారు.

### వంద అడుగుల జెండా ఊరేగింపు



వంద అడుగుల జెండాతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం వంద అడుగుల జాతీయ జెండాను కాశీబుగ్గకు చెందిన వస్త్ర దుకాణాల సిబ్బంది ఊరేగించారు. కేటీ రోడ్డులో ర్యాలీగా వెళ్లారు. భారతమాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తిని చాటుకున్నారు.

### క్రికెట్ టోర్నమెంట్ విజేత డి.గొనపపుట్టుగ

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో ఈ నెల 16వ తేదీ నుంచి కంచమ్మతల్లి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించిన సంగతి తెల్సిందే. ఈ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు ఆదివారం జరిగాయి. ఇందులో డి.గొనపపుట్టుగ–పలాస జట్లు తలపడ్డాయి. డి.గొనపపుట్టుగ జట్టు విజేతగా గెలుపొందగా, పలాస జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్లకు స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్ణారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు అందజేశారు.

### ముగిసిన దివ్యజీవన మహాసభలు

కాశీబుగ్గ: కాశీబుగ్గలో మూడు రోజులు జరిగిన తెలుగు రాష్ట్రాల 49వ దివ్య జీవన మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం వందలాది మంది భక్తులతో నగరసంకీర్తనలు ప్రత్యేకంగా నిర్వహించారు. అనంతరం ప్రవచనాలు, అన్నదానం, గీతాపారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వచ్చే ఏడాది 50వ మహాసభలు తిరుపతి క్షేత్రంలో నిర్వహించాలని నిర్ణయించారు.

# అరకొరగా కూరగాయల సాగు!

- ఆసక్తి చూపని రైతులు
- మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు
- దోచుకుంటున్న దళారులు



బిర్లంగి సమీపంలో సాగులో ఉన్న ఆకుకూరలు



బొడ్డబడలో వంకాయల తోట

ఇచ్ఛాపురం రూరల్: కూరగాయలు, ఆకుకూరల సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో రైతులు అనాసక్తి చూపిస్తున్నారు. ఇచ్ఛాపురం మండలంలోని బొడ్డబడ, బిర్లంగి, పాయితారి, కొళిగాం, ధర్మపురం గ్రామాల్లో గతంలో అధికంగా వీటిని సాగు చేసేవారు. ప్రస్తుతం పెద్దగా ఇష్టపడడం లేదు.

**నిల్వ చేసే సౌకర్యం లేక..**

కూరగాయల సాగు చేసే రైతులకు నిల్వ సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. పండించిన కూరగాయలు, ఆకు కూరలకు మార్కెట్‌లో సరైన ధర రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజీలు లేకపోవడంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. దీనికితోడు ఏటా పెరుగుతున్న కూరగాయల విత్తనాల ధరలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులతో గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో సాగుపై ఆసక్తి చూపడం లేదు.

**మార్కెటింగ్ సమస్య**

ఈ ప్రాంతాల్లో కూరగాయల సాగు చేస్తున్న రైతులకు మార్కెటింగ్ సమస్య వెంటాడుతోంది. ఆంధ్రాలో ఇచ్ఛాపురం తప్పా కూరగాయల కొనుగోళ్ల మార్కెట్‌లు ఎక్కడా లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో బరంపురం, ఛత్రపురం, రౌండా, జయంతిపురం, పాత్రపురం, చీకటిపేట వంటి ఒడిశా ప్రాంతాలకు రైతులు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. ఒడిశా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు గ్రామాల్లోనే దళారులకు అమ్ముతున్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**పట్టించుకోని ప్రభుత్వం**

ఇచ్ఛాపురం మండలంలో సుమారు ఐదు వందల ఎకరాల్లో రైతులు కూరగాయలు పండిస్తున్నారు. ఏడాదికి ఓమారు ఉద్యానవన అధికారులు చుట్టం చూపుగా వస్తారే తప్పా అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి విత్తనాలు, నారు లభించకపోవడంతో బరంపురం వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. పురుగు మందు సైతం పొరుగు రాష్ట్రం ఒడిశా నుంచే వందల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పురుగు పోటుతో పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి నష్టపరిహారం రావడంలేదంటున్నారు.

#### ప్రభుత్వ సాయం లేదు



ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకొని కాయగూరలు పండిస్తున్నాను. ఈ ఏడాది వంకాయ, క్యాబేజీ, దోస, ఆకుకూరలను వేశాను. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందటం లేదు. కనీసం రాయితీపై పురుగు మందులు కూడా సరఫరా చేయడం లేదు. అధికారులు వచ్చి సూచనలు సలహాలు ఇస్తే బాగుంటుంది.

– భాస్కరశెట్టి, కూరగాయల రైతు, బొడ్డబడ

#### దళారులే కొంటున్నారు



మేము పండించిన పంటను అమ్ముకోవాలంటే ఒడిశా వెళ్లాల్సిందే. అందుకే దళారులు వేకువ జామున మా గ్రామానికి వచ్చి వారికి నచ్చిన ధరల్లో కొనుగోలు చేస్తారు. కూరగాయలు నిల్వ చేసేందుకు ఎటువంటి కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతో దిక్కులేక దళారులు ఎంతకు కొంటే అంతకే అమ్ముకుంటున్నాము. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకునేందుకు విత్తనాలు, నారు సరఫరా చేస్తే సంతోషం.

– పుణ్యా బెహరా, కాయగూరల రైతు, కొళిగాం

## రక్తదానం..



టెక్కలి పట్టణానికి చెందిన అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఏటా రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవం రోజుల్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈసారి టెక్కలి జిల్లా ఆస్పత్రిలో శిబిరాన్ని ఏర్పాటు చేయగా పలువురు రక్తదానం చేసినట్టు అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు తెలిపారు. రక్తదాతలకుసర్టిఫికెట్లు అందజేశారు.

–టెక్కలి

## విగ్రహావిష్కరణ..



కంచిలి మండలంలోని మఠం సరియాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన దివంగత కొణపల లింగరాజు, కొణపల గణేష్‌ల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు గౌతమి బుద్ధిని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ఆదివారం ఆవిష్కరించగా.. స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, కోమలాంగి, కొణపల చంద్రావతి, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథ్, ఉపసర్పంచ్‌లు బుడ్డెపు ఆనంద్, మోహనరావు, పాఠశాల హెచ్ఎం భాస్కరరౌళో పాల్గొన్నారు.

–కంచిలి

## శంకుస్థాపన..



కవిటి మండలం ఆర్.బెలగాం ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న మధ్యాహ్న భోజనం వంటశాల పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు ఒక లక్ష రూపాయలతో దీన్ని నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, మద్దిలి ఈశ్వరరావు, సంతోష్ పట్నాయక్, బాసుదేవరౌళో పాల్గొన్నారు.

–కవిటి

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్



కార్యకర్తలకు ధైర్యం చెబుతున్న పేరాడ తిలక్

టెక్కలి: టీడీపీ కార్యకర్తల చేతిలో అక్రమ కేసులకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని.. ప్రతీ ఒక్కరికీ అండగా నిలబడి న్యాయస్థానంలో పోరాటం చేస్తానని ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ భరోసా ఇచ్చారు. సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామంలో అక్రమ కేసులకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఆదివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. గ్రామ సర్పంచ్ అంగ లక్ష్మితో పాటు నాయకులు మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ పాలనలో టీటీడీ దేవస్థానం ఆధ్వర్యంలో రామాలయం నిర్మాణానికి రూ.. 15 లక్షలు మంజూరు చేశారన్నారు. సుమారు రూ. తొమ్మిది లక్షల ఖర్చుతో నిర్మాణం పనులు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి అచ్చెన్నాయుడు అండతో బిల్లులు నిలిపి వేయడమే కాకుండా పనులు సైతం ఆక్రమించుకున్నారని వాపోయారు. అంతే కాకుండా గతంలో జరిగిన చిన్నపాటి తగాదాపై ఫిర్యాదులు చేసి 12 మందిపై అక్రమంగా కేసులు నమోదు చేయించారన్నారు. గ్రామంలో భగవంతునితో సైతం రాజకీయాలు చేస్తున్నారని వారంతా తిలక్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ.. టీడీపీ కార్యకర్తలు పోలీసులతో నమోదు చేయిస్తున్న అక్రమ కేసులకు ఎవరూ భయపడవద్దని ధైర్యం చెప్పారు. అక్రమ కేసులు, అరెస్టులకు గురైన ప్రతీ ఒక్క కార్యకర్తకు అండగా నిలబడి న్యాయ స్థానంలో పోరాటం చేస్తానన్నారు. అలాగే సంక్షేమ పథకాల విషయంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నవారికి ఎవరికైనా పింఛన్లు ఆపివేయడం, ఇతర సంక్షేమ పథకాలు నిలిపివేయడం చేస్తే తక్షణమే తనకు తెలియజేయాలన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అక్రమాలు, అరాచకాలపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. సర్పంచ్ అంగ లక్ష్మి, నాయకులు ఎ.జనార్దనరావు, వి.సింహాచలం, వి.జగది, బి.ఉత్తరరావు, ఎ.ప్రసాద్, ఎ.మల్లేష్‌తో పాటు పార్టీ జిల్లా నాయకులు కె.బాలకృష్ణ, టి.బలరాం, డి.కృష్ణారావు ఉన్నారు.

## ఉత్తమ సేవలకు ఐటీడీఏ పీవో ప్రశంస



ల్యాబ్ టెక్నీషియన్ కవితకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

కంచిలి: కంచిలి పీహెచ్‌సీ సిబ్బంది, నువాగడ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం దుర్గాప్రసాద్ పాఢిలను సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ప్రశంసించారు. రిపబ్లిక్ డే వేడుకలు సందర్భంగా సీతంపేటలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వీరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇందులో కంచిలి పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ బి.కవిత, బూరగాం సచివాలయం ఏఎన్ఎం బి.సోమలత, గోకర్ణపురం సచివాలయం ఆశ వర్కర్ కె.కామేశ్వరిలు ఉన్నారని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.హరిబాబు తెలిపారు. అలాగే నువాగడ గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం దుర్గాప్రసాద పాఢి విద్యార్థులకు అందిస్తున్న సేవల్ని కొనియాడుతూ ప్రశంసాపత్రాన్ని అందించారు.

## సందడిగా దుప్పలపాడు పాఠశాల శత వసంతాల వేడుక



పాఠశాలకు వందేళ్లు గడచిన సందర్భంగా గుర్తుగా పైలాన్ ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



పూర్వ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

- హాజరైన పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

టెక్కలి: అక్కడ సందడి నెలకొంది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. వివరాల్లోకి వెళితే.. కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు ప్రాథమిక పాఠశాల ఏర్పాటై వందేళ్లు గడచిన సందర్భంగా ఆదివారం పాఠశాలలో పూర్వపు విద్యార్థులు, గ్రామస్థులతో శత వసంత వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వందేళ్లకు గుర్తుగా పైలాన్‌ను ఆవిష్కరించారు. పూర్వపు ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకరిస్తామని పూర్వవిద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి భారతి సూర్యప్రకాశ్, ఎంఈవో ఎల్.వి.ప్రతాప్, ఉప సర్పంచ్ గురువెల్లి భారతి అప్పన్న, హెచ్ఎం ఎస్.సన్యాసప్పారావు, ఆర్గనైజర్ వై.సూర్యనారాయణ, వై.నరసింహమూర్తి పాల్గొన్నారు.

#### ఉన్నత స్థానంలో ఉన్నాను..



మా గ్రామంలో 1963–68 సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలో చదివాను. ప్రణాళికతో చదవడంతో ఈ రోజు ఉన్నత స్థానంలో ఉన్నాను. గల్ఫ్ దేశాల్లో సివిల్ ఇండస్ట్రీస్‌లో పనిచేసి రిటైర్ అయ్యాను. మా ఉపాధ్యాయుడు నంబాళ్ల అప్పారావు ప్రోత్సాహం ఎన్నటికీ మరువలేను. పాఠశాల వందేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి వచ్చాను.

–కణితి జనార్ధనరావు, ఎన్ఆర్ఐ కెనడియన్, పాఠశాల పూర్వపు విద్యార్థి

# మువ్వన్నెల రెపరెపలు..

ఊరూ..వాడా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. రిపబ్లిక్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, పోలీసుస్టేషన్లు, కోర్టులు, గ్రంథాయాలు, స్వచ్ఛంద సంస్థల ఆఫీసుల వద్ద జాతీయజెండాను ఆయా విభాగాల అధికారులు, ప్రతినిధులు ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



టెక్కలి కోర్టు సముదాయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు



కంచిలి: జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్



టెక్కలి ఆర్డీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి



కంచిలి: మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో వి.తిరుమలరావు, పక్కన ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి



వజ్రపుకొత్తూరు: మండల పరిషత్ వద్ద జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు



నందిగాం: తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ సోమేశ్వరరావు సోమేశ్వరరావు



సంతబొమ్మాళి: జాతీయ జెండాను అవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కాశీబుగ్గ: పోలీసు సబ్ డివిజన్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు



కాశీబుగ్గ: మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేస్తున్న కమిషనర్ ఎన్.రామారావు



సోంపేట కోర్టుల సముదాయంలో పతాకావిష్కరణ చేస్తున్న జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కె.కిశోర్‌బాబు



టెక్కలిలో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



కాశీబుగ్గ: పలాస కోర్టు వద్ద జెండాను ఎగురు వేస్తున్న జడ్జి సీహెచ్ హరిప్రియ రావు



ఇచ్ఛాపురం: మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కమిషనర్ ఎన్.రమేష్ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేస్తున్న తహసీల్దార్ ఎన్.వెంకటరావు



ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న ఎంపీపీ బోర పుష్ప



కవిటి రెవెన్యూ కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న తహసీల్దార్ మురళీమోహనరావు



కవిటి మండలపరిషత్ వద్ద పతాకావిష్కరణలో ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి



ఇచ్ఛాపురం రూరల్: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేస్తున్న తహసీల్దార్ ఎన్.వెంకటరావు



ఇచ్ఛాపురం రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న ఎంపీపీ బోర పుష్ప



కవిటి:లండారిపుట్టుగ సచివాలయం వద్ద పతాకావిష్కరణలో ఎమ్మెల్సీ నర్తు రామారావు